క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంటీఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన ఉపాధ్యాయులను ఎంటీఎఫ్ నాయకులు సన్మానించారు. ఆదివారం పురపాలక ఉర్దు బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉత్తమ అవార్డు పొందిన ప్రధానోపాధ్యాయులు అలీం సిద్ధిఖీ, ఉపాధ్యాయుడు మిట్టా నిరంజన్ కుమార్‌లను ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య నాయకులు బడుగు బసవరాజు, ఎల్లాగి, రమేష్‌రావు సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంటీఎఫ్ నాయకులు కోటన్న, చంద్రమౌళి, జంగం బసవ రాజు, ప్రతాప్ రెడ్డి, గుర్రప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎలక్ట్రికల్ ఫీడర్ ఏర్పాటు



ఫీడర్ ఏర్పాటు కోసం గుంతలు తవ్వుతున్న దృశ్యం

ఆదోని రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రోగులకు విద్యుత్ సమస్యలు లేకుండా సక్రమంగా సౌకర్యాలు అందించేందుకు ఎలక్ట్రికల్ ఫీడర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ ఏడీ పురుషోత్తం తెలిపారు. ఆదివారం విద్యుత్‌శాఖ ఏఈ ఉలిగప్ప పర్యవేక్షణలో కాంట్రాక్టర్ రంగస్వామి ఫీడర్ ఏర్పాటు చేశారు. ఆసుపత్రి లోపల విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

పదవీ విరమణ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీటీజీ నాయకులు

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ (ఏపీటీజీ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం నేషనల్ పాఠశాలలో ఏపీటీజీ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, కేశవయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎల్‌కె. చిన్నప్ప, చంద్రశేఖర్, జయరాం మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన తర్వాత పెన్షనర్లకు రావలసిన గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ డబ్బులు ఇవ్వలేదన్నారు. వెంటనే వాటిని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మధుసూదన్, పరిమళ, లలిత, బసవ రాజ్, సిద్దనగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా



బోల్తా పడిన వరి లోడ్ లారీ

కౌతాళం: మండల పరిధిలోని గొతులదొడ్డి-కుంబళనూరు క్యాంపు-1 మధ్య ఉన్న నల్ల వంక వద్ద ఆదివారం లారీ బోల్తా పడింది. పెను ప్రమాదం తప్పింది. కుంబళనూర్య క్యాంపు-1 నుంచి వరి బస్తాలతో కర్నూలుకు వెళ్తున్న లారీ వంక వద్ద ఉన్న కల్వర్టు భారీ వర్షాలకు కోతకు గురి కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. ఈ ఏడాది కురుస్తున్న వర్షాలకు మండలంలోని రోడ్లు గుంతలమయంగా మారడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకుంది. ఇకనైన అధికారులు శాశ్వత మరమ్మతు పనులు చేపట్టాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌతాళం: కుండపోత వర్షానికి మండల కేంద్రమైన కౌతాళంలో జలమయమైన ప్రాంతాల ప్రజలకు శివ కిరణ్ ట్రేడర్ యాజమాని నవీన్ రెడ్డి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రామంలోని ఎన్టీఆర్ నగర్, కొండాల్‌గేరి, ఎస్సీ కాలనీ, పోస్టు ఆఫీస్ ఏరియాల్లోని ఇళ్లల్లో నీరు చేరి నిల్వ ఉన్న ధాన్యం నానిపోయాయి. కాలనీ వాసులకు ఆదివారం నవీన్‌రెడ్డి తన సొంత ఖర్చులతో నిత్యావసర సరుకులను అందజేశారు.

శివారు కాలనీలు.. సౌకర్యాలు కరువు

- సరైన రహదారులు, డ్రైనేజీలు లేక అవస్థలు
- వర్షం కురిస్తే ఇళ్లలోకి చేరుతున్న నీరు
- రోడ్లన్నీ బురదమయం
- రోగాలబారిన పడుతున్న ప్రజలు



విజయనగర్ కాలనీలో నీరు నిల్వ ఉండి నడవడానికి వీలులేకుండా మారిన రహదారి,



కాలనీలోని ఓ వీధిలో నిలిచిన వర్షపునీరు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని శివారు కాలనీలు అస్తవ్యస్తంగా మారాయి. కాలనీల్లో సరైన రహదారులు, డ్రైనేజీ వంటి సౌకర్యం లేక పోవడంతో మురుగు నీరుతో పాటు వర్షపు నీరు రోడ్ల మీద నిల్వ చేరుతున్నాయి. రెండు నెలలుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కాలనీలు బురదమయంగా మారాయి. వీటిని దోమలు ఆవాసాలుగా ఏర్పాటు చేసుకొని రాత్రి పూట స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అయినా సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

అస్తవ్యస్తంగా రహదారులు

ఆదోని పట్టణంలో శివారు ప్రాంతాలైన విజయనగర్ కాలనీ, మైనార్టీ కాలనీ, రాయనగర్, పైకొట్టాల, అమరావతి నగర్, హనుమాన్ నగర్, దండు గేరి, వాల్మీకీ నగర్, కోట్ల భాస్కర్ రెడ్డి కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఇందిరానగర్, ఎరుకల కాలనీ, మహాయోగి లక్ష్మమ్మ నగర్, ఆర్టీసీ బస్టాండు వంటి పలు ప్రాంతాల్లో కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలనీలు విస్తరిస్తున్నాయి కానీ అందుకు తగ్గట్లు మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగర్ కాలనీ, వైఎస్సార్ కాలనీ వంటి పలు ప్రాంతాల్లో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రహదారుల వెంబడి పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు మొలచి రాక పోకలకు అంతరాయంగా ఉన్నాయి. మురుగు నీళ్లు ఇంటి ముందు నిల్వ ఏర్పడడంతో దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. రాత్రిపూట వీధి దీపాలు కూడా సరిగా ఉండవు. చీకట్లో బయటకు వెళ్లాలి అంటేనే ఇబ్బందికరంగా ఉంటుంది. విష సర్పాలు వంటివి తిరుగుతూ ఉంటాయి. ఇక వర్షం వచ్చిందంటే ఇళ్లలోకి నీరు చేరడమే కాకుండా కాలనీలు చిత్తడి చిత్తడిగా మారి నడవడానికి కూడా వీల్లేకుండా ఉంటున్నాయి. కాలనీలలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగించి రహదారులు, డ్రైనేజీ వంటి పనులను చేపట్టాలనీ అధికారులకు, పాలకులకు విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు చెపుతున్నారు.



చిత్తచిత్తడిగా మారిన రోడ్డు

అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం..

పట్టణంలోని శివారు కాలనీలో నివసించే వారంతా కూలీ పనులను చేసుకొని జీవనం సాగించే వారే. ఎన్నికల ముందు ఓట్లు అడగడానికి వస్తారు కానీ, ఎన్నికల తర్వాత ఎవరూ తొంగి చూడరు అంటూ కాలనీ వాసులు వాపోతున్నారు. విజయనగర్ కాలనీ, మైనార్టీ కాలనీ, దండుగేరి, వాల్మీకి నగర్, భాస్కరెడ్డి కాలనీ, అమరావతి నగర్ వంటి పలు కాలనీ వాసులు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు, పాలకులకు విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అయా కాలనీల్లో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ ఏర్పడడంతో దోమలు వచ్చి చేరుతున్నాయి. దీంతో చాలమంది వ్యాధుల బారిన పడుతున్నారు. శివారు కాలనీలలో ప్రజలు ఎలా ఉన్నారు అని ఒక్కరు కూడా వచ్చి చూడడం లేదని విజయనగర్ కాలనీ వాసులు వాపోతున్నారు.

అవస్థలు పడుతున్నాం



కాలనీలో సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నాం. రహదారులు, మురుగు కాలువల వంటి సౌకర్యాలు లేవు. వర్షం వచ్చిందంటే ఇళ్లలోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టి అడుగు వేయలేని దుస్థితి. నీరు నిల్వ ఏర్పడడంతో దోమలు చేరుతున్నాయి. రాత్రి పూట దోమలు స్వైర విహారం చేయడంతో ఇబ్బందులకు గురువుతున్నాం. ఇప్పటికే చాల మంది వ్యాధుల బారిన పడ్డారు. ఇన్ని అవస్థలు పడుతున్నా మమ్ములను పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైన పాలకులు స్పందిస్తే బాగుంటుంది.

– మంజుల, విజయనగర్ కాలనీ, ఆదోని

తాగునీరు కూడా సరిగా రాదు



మా కాలనీలో రహదారులు, డ్రైనేజీ వంటి సౌకర్యాలే కాదు, తాగునీరు కూడా సరిగా రావడం లేదు. మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ ఏర్పడడంతో కాలనీ అస్తవ్యస్తంగా మారింది. దోమలు, పందులతో సహజీవనం చేస్తున్నాం. కాలనీలో రహదారులు వేయక పోయినా కనీసం గరుసు వేసి నీరు నిల్వ కుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

– రసూల్, విజయనగర్ కాలనీ, ఆదోని

అబద్ధాలకు కేరాఫ్ ఎమ్మెల్యే బీవీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: అబద్ధాలు చెప్పడంలోనూ, డైవర్షన్ రాజకీయాలు చేయడంలో దిట్ట ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, మాజీ కౌన్సిలర్ మధుబాబు, చేనేత నాయకుడు మల్లికార్జున అన్నారు. ఒక ఎంపీగా పనిచేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకను విమర్శించడం ఆయన అవివేకానికి అద్దం పడుతోందన్నారు. ఆదివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వారం రోజుల క్రితం ప్రజలు సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలియడంతో తమ నాయకురాలు బుట్టా రేణుక పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారన్నారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలతో పాటు వంద పడకల ఆస్పత్రిని పరిశీలించగా అక్కడ సౌకర్యాలు, సిబ్బంది లేక రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొని వారి గురించి మాట్లాడారని గుర్తు చేశారు. అయితే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి బుట్టా రేణుక కొందరు చెప్పిన మాటలు విని అవగాహన లేకుండా ఆస్పత్రి గురించి మాట్లాడుతున్నారని విలేకరుల సమావేశం ఏర్పాటు చెప్పి చెప్పడం విడ్డూరంగా వుందన్నారు. ఆస్పత్రితో పాటు రాష్ట్రంలోనే అత్యధికంగా విద్యార్థినులు చదువుతున్న స్థానిక ఎంఎస్ బాలికల హైస్కూల్ అభివృద్ధి పనులకు చేయూత నిచ్చేందుకు బుట్టా ఫౌండేషన్ సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్‌కు ఆమె విన్నవించారన్నారు. అయితే దానికి కూడా మోకాలడ్డుతూ.. రాజకీయం చేస్తూ ప్రజలు, విద్యార్థినుల ఇబ్బందులకు కారకులవుతున్నారని విమర్శించారు. సమావేశంలో బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు బోయబజారి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, పాలశ్రీనివాసరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, నాయకులు మహబుబ్‌బేగ్, బోయరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పనులు 50 శాతం పూర్తి



నిర్మాణంలో వున్న మెడికల్ కళాశాలను చూపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: పేద విద్యార్థులకు వైద్య అందించడంతో పాటు బడుగులకు మెరుగైన వైద్యం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మెడికల్ కళాశాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారని మున్సిపల్ వైస్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్ అనారు. ఆదివారం ఆదోని సమీపంలోని ఆరేకల్ వద్ద నిర్మాణంలో వున్న మెడికల్ కళాశాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పేద విద్యార్థుల కోసం మాజీ సీఎం వైఎస్ జగనన్న ఆదోని సమీపంలోని ఆరేకల్ వద్ద 58.44 ఎకరాల్లో రూ.476కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మాణానికి పూనుకున్నారన్నారు. అయితే ఆయా పనులు 50శాతంపైగా పూర్తి అయ్యాయన్నారు. పనులు జరిగే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 15నెలలు గడుస్తున్నా ఆయా పనులు పూర్తి చేయలేక ప్రైవేట్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్వాకంతో రెండేళ్లు దాదాపు 150 ప్రభుత్వ మెడికల్ సీట్లను పేద విద్యార్థులు కోల్పోయారన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పూర్తిచేసి, ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గంధం మహోత్సవం



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ముస్లింలు

ఆదోని రూరల్: పట్టణంలోని కొడల్‌పేటలోని సమ్మద్ మాసుమ్ పీర్ దర్గాలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు డాక్టర్ సయ్యద్‌ఖమర్ పీర్ ఖాద్రి గంధం మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తుల రాకతో దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. సోమవారం ఉరుసు, మంగళవారం జియారత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సయ్యద్‌అహ్మద్ పాషాఖాద్రి, సయ్యద్‌సోహేబ్‌ఖాద్రి తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు తెల్లవారుజామున ఆలయంలోని మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, అమ్మవార్లకు కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణ తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

ఆదోని టౌన్: ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పాలిశెట్టి దామోదరరావు, అధ్యక్షులు లక్ష్మన్న, కార్యదర్శి ఉలిగప్ప డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి చెల్లించాల్సిన 11వ పీఆర్‌సీ, 24 నెలల బకాయిలు, డీఏలు, అరియర్స్ వెంటనే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు రంగనాథ్, బాసా, కుమార్, ఎ.వి.రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పై కప్పు పెచ్చులూడి వ్యక్తికి గాయాలు





కాంప్లెక్స్ పై కప్పు పెచ్చులూడి పడిన దృశ్యం, తలకు గాయమైన బాధితుడు కర్లి చిన్న ఈరయ్య

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ప్రధాన డి. బెళగల్ రోడ్డులోని కుర్ని నాగరాజు కాంప్లెక్స్‌లో ఓ దుకాణం వద్ద పైకప్పు పెచ్చులూడి వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. కోసిగికు చెందిన కర్లి చిన్న ఈరయ్య అనే వ్యక్తి కాంప్లెక్స్‌లోని శ్రీ రాఘవేంద్ర మెడికల్ షాపుకు మందులు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అక్కడ కాంప్లెక్స్ పై కప్పు సిమెంట్ పెచ్చులూడి ఈరయ్య తల పై పడింది. తలకు రక్త గాయం కావడంతో స్థానిక ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 ఆంబులెన్స్‌లో ఆదోని హాస్పిటల్‌కు తరలించారు.

సమస్యలు పరిష్కరిస్తాం

కౌతాళం: సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ అన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి సహకారంతో ఆదివారం గ్రామంలో హనుమాన్‌నగర్, పోలీస్‌స్టేషన్ ఏరియా వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పేరుకుని పోయిన చెత్తాచెదారాన్ని జేసీబీతో తొలగించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిక్కయ్య పలువురు పాల్గొన్నారు.

దివ్యాంగుల సాధికారతే ధ్యేయం

ఆదోని రూరల్: దివ్యాంగుల సాధికారతే ధ్యేయంగా.. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై, ఇబ్బందులపై డీఈఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.సి.నాగరాజు తెలిపారు. పట్టణంలోని శ్రీ అనంత మంగళ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం రాష్ట్రస్థాయి డీఈఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర డీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.శివశంకర్, ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. అనంరం డీఈఎఫ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, అధ్యక్షుడిగా బీసీ నాగరాజు, ఉపాధ్యక్షులుగా కమతం వెంకటేష్‌తో పాటు మరో 10 మందిని ఎన్నుకున్నారు.

జీవీ మాల్‌ను ప్రారంభించిన అనసూయ



పట్టుచీరను ప్రదర్శిస్తున్న అనసూయ

ఆదోని టౌన్: పట్టణంలోని ఆస్పరి రోడ్డులో ఏర్పాటు చేసిన జీవీ మాల్‌ను సినీ నటి అనసూయ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. షోరూం అధినేత గుర్రం ఉమా మహేశ్వరరావు, గుర్రం వాసు, గుర్రం నరేష్, గుర్రం అంకిత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనసూయను చూసేందుకు ఆదోని పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అభిమానులు రంగమ్మత్త, రంగమ్మ అత్త అని పిలువగా అనసూయ సంబరపడ్డారు. ప్రారంభం అనంతరం ప్రేక్షకుల అభిమానం మేరకు అనసూయ నృత్యాలు చేస్తూ అభిమానులను అలరించారు. ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, జనసేన పార్టీ ఆదోని ఇన్‌చార్జి మల్లప్ప తదితరులు పాల్గొన్నారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు, పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న శ్రీ అంబా భవాని దేవాలయ పాలక కమిటీ సభ్యులు

ఆదోని రూరల్: దసరా శరన్నవ రాత్రి మహోత్సవ వేడుకల్లో పాల్గొనాలని శ్రీ అంబా భవాని దేవాలయ పాలక కమిటీ మరియు ఆదోని సమాజ్ ప్రముఖులు ఆదివారం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో సాయిప్రసాద్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ కౌన్సిలర్ చంద్రకాంత్‌రెడ్డి, తిమ్మరాజులకు ఆహ్వన పత్రికను అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త జిందే గోవిందరావు, అంబా భవాని దేవాలయ పాలక కమిటీ సభ్యులు, సమాజ్ వైస్ ప్రెసిడెంట్ సఫారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో కూడా తరగతులను నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ వీరేష్, పట్టణ కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తరగతులను నిర్వహిస్తున్న పట్టణంలోని నారాయణ, శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులతో మాట్లాడి తరగతులను బహిష్కరించారు. గ్రేడుల కోసం విద్యార్థులను సెలవు రోజుల్లో కూడా మానసిక ఒత్తిడి గురిచేస్తున్నారన్నారు.

ఆదోని రూరల్: సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న ఆదోనిలోని చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాలు డిమాండ్ చేశారు. ఆదివారం వారు పాఠశాలను సందర్శించి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు చైతన్య పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఎంఈఓ స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు గిడ్డయ్య, వినోద్, సూరి తదితరులు పాల్గొన్నారు.

పందుల అపహరణ

ఆదోని అర్బన్: తన 60 పందులను అపహరించారని పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఎరుకల కమలయ్య త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడని పోలీసులు తెలిపారు. గత నెల 10వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు వాటిని దొంగలించారని, వాటి విలువ రూ.21 లక్షలు ఉంటుందని తెలిపాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చదువులకు దూరమవుతున్న ఎస్సీ విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు రద్దు కావడంతో వేలాది మంది పేద ఎస్సీ విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని జైభీం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో శిథిలమై పడిపోయిన ఎస్సీ బాలికల, బాలుర సంక్షేమ హాస్టళ్ల భవనాలను సంఘ నాయకులతో కలిసి పరిశీలించారు. పడిపోయిన ఎస్సీ సంక్షేమ హాస్టళ్లను పునర్నిర్మించి, పునః ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలిచ్చామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సంధ్యపోగు ఎర్రన్న, బుజ్జిబాబు, అబ్రహం, కదిరికోట పద్మక్క, రాజు పాల్గొన్నారు.

వేరుశనగ గరిష్ట ధర రూ.6,890



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో రైతులు అమ్మకానికి తెచ్చిన వేరుశనగ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు ఆదివారం పలు ప్రాంతాల నుంచి రైతులు వేరుశనగ దిగుబడులను విక్రయానికి తెచ్చారు. మార్కెట్‌కు 531 క్వింటాళ్ల వేరుశనగ దిగుబడులు రాగా క్వింటా ధర గరిష్టంగా రూ.6,890 పలుకగా కనిష్ఠ ధర రూ.3,429, మధ్యస్థ రకం వేరుశనగ రూ.5,900 ధర పలికినట్లు మార్కెట్‌యార్డ్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు.

మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే జైలుకే

మంత్రాలయం రూరల్: మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా, జైలుశిక్ష పడుతుందని ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. మండల పరిధిలోని చట్నిహళ్లి గ్రామం సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం స్థానిక రాఘవేంద్ర రెస్టారెంట్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రెస్టారెంట్‌లలో, పబ్లిక్ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమన్నారు. అనుమతులు లేకుండా రెస్టారెంట్‌లలో మద్యం సేవించడానికి పూనుకుంటే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి

కౌతాళం: సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, వీరేష్, రామలింగ, శంకర్, సత్యప్ప, గురు పాల్గొన్నారు.